ప్రజాశక్తి
గురువారం 18 జులై 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సంక్షోభం కాదు కేంద్రం కుట్రే

స్టీల్ రక్షణ సెమినార్‌లో వక్తల ఉద్ఘాటన



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ది సంక్షోభం కాదని, కేంద్ర ప్రభుత్వ కుట్ర అని వక్తలు ఉద్ఘాటించారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన 'సంక్షోభంలో విశాఖ ఉక్కు-అధిగమించడం ఎలా' అనే అంశంపై స్టీల్‌ప్లాంట్ టి అండ్ డి సి (ట్రైనింగ్ సెంటర్) ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తలుగా స్టీల్ ప్లాంట్ మాజీ సిఎండి శివసాగరరావు, అఖిలభారత సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పాల్గొని మాట్లాడారు.

స్టీల్‌ప్లాంట్ మాజీ సిఎమ్డిఇ శివసాగరరావు మాట్లాడుతూ, దేశ అవసరాలకు అవసరమైన 300 టన్నుల స్టీల్ ఉత్పత్తిలో స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు, ఇతర రా మెటీరియల్ అందిస్తే 100 టన్నులు ఆర్ఐఎన్ఎల్‌లోనే ఉత్పత్తి అవుతుందన్నారు. మౌలిక వసతుల్లేకుండా స్టీల్ రంగం అభివృద్ధి కాదన్నారు.

సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మాట్లాడుతూ, వైజాగ స్టీల్ ప్లాంట్ మాత్రమే కాకుండా 2021లో దేశంలోని 49 ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని మోడీ సర్కారు అమ్మకానికి పెట్టిందని, ఆర్థిక సంక్షోభంలో ఉక్కు ఉందని ప్లాన్ సృష్టించి ప్లాంట్‌కు రా మెటీరియల్ ఇవ్వకుండా, సొంత గనులు, బ్యాంకు రుణాలు ఇవ్వకుండా చంపెయ్యాలన్న కుట్ర చేసిందని పేర్కొన్నారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌పై జరుగుతున్న దాడులను ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రజలు ఎంతగానో పోరాటం చేశారని గుర్తుచేశారు. స్టీల్ ప్లాంట్‌కు అండగా నిలబడతారన్న నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఓటు వేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రతినిధులు కేంద్రంతో మాట్లాడి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పునర్ వైభవం తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి ఉద్యోగులు, నిర్వాసితులు, జిల్లా ప్రజానీకం ఎంతగానో పోరాటాలలో సహకరించారని తెలిపారు. సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా విశాఖ స్టీల్ ప్లాంట్ మరింత అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు.

స్టీల్ ప్లాంట్ ఆపరేషన్స్ మాజీ డైరెక్టర్ కెకె.రావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని తెలిపారు. కార్మికుల సమిష్టి

మిగతా 2లో..

వసంత్ కెమికల్స్‌లో...

రియాక్టర్ పేలి ఒకరు మృతి

- రూ.35 లక్షల పరిహారానికి యాజమాన్యం అంగీకారం
- విచారణకు ఆదేశించిన కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, రాంబిల్లి, అనకాపల్లి విలేకర్లు

అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం సెజ్ పరిధి రాంబిల్లి మండలంలోని లాలం కోడూరు శివారులో ఉన్న వసంత్ కెమికల్స్‌లో బుధవారం రియాక్టర్ పేలడంతో ఒడిశాకు చెందిన ప్రదీప్ రౌత్(44) అక్కడికక్కడే మరణించాడు. మృతిచెందిన ప్రదీప్ రౌత్ కంపెనీలో హౌస్ కీపింగ్ చేస్తున్నాడు. బుధవారం ఉదయం 6 గంటలకు విధులకు హాజరయ్యాడు. 8.30 గంటల సమయంలో రియాక్టర్ పేలి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో క్లీనింగ్ పనులకు అక్కడికి వెళ్లాడని యాజమాన్య ప్రతినిధులు, పోలీసులు చెబుతున్నారు.

ప్రమాదంలో మరణించిన ప్రదీప్‌రౌత్ కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కంపెనీ యాజమాన్యం రూ.35 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు అంగీకరించినట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. దీంతో పాటు ఇఎస్ఐ బెనిఫిట్స్ కూడా కుటుంబ సభ్యులకు అందించనున్నట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించిన ప్రదీప్‌రౌత్ భార్య, ఇద్దరు పిల్లలు ఒడిశా నుంచి అనకాపల్లి వస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రమాదంపై విచారణకు రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ వివిఎస్ఇజెడ్, డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్, ఎపిపిసిబి ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో కమిటీ విచారణ చేపట్టి నివేదికను 7 రోజులలోపు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రధాన వార్త మెయిన్‌లో....



భక్తి శ్రద్ధలతో మొహర్రం

వార్తలు లోపలి పేజీల్లో..

హోటళ్లలో ఆహార భద్రత తనిఖీలు

వార్త 2లో..

గాజువాక ఉడా కాలనీలో ప్రేమోన్మాది దాడి

వార్త మెయిన్‌లో..

ప్రయివేటు కళాశాలల దౌర్జన్యంపై ఎస్ఎఫ్ఐ నిరసన

వార్త 8లో..

ప్రజలకు అందుబాటులో ఉంటా

బాధ్యతల స్వీకరణలో అనకాపల్లి ఎస్‌పి దీపిక



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకుంటానని అనకాపల్లి ఎస్‌పి ఎం.దీపిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె బుధవారం ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ప్రతి సోమవారమూ నేరుగా తనను కలవొచ్చాన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు. వంద రోజుల ప్రణాళిక అమలుకు కృషి చేస్తామన్నారు. మహిళలు, పిల్లల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. నేర ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట పోలీసు బీట్స్ ఏర్పాటుచేస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ తదితర సమస్యలపై కేంద్రీకరించనున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తానని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పి దీపికను అదనపు ఎస్‌పి బి.విజయభాస్కర్, అనకాపల్లి డిఎస్‌పి ఎస్.అప్పలరాజు, పరవాడ

మిగతా 2లో..

ఎర్రమట్టి దిబ్బల విధ్వంసం ఆపాలి

ఎయు భూములపై సమగ్ర విచారణ జరపాలి

జిల్లా కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ-భీమిలి సాగర తీరంలో వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఎర్రమట్టి దిబ్బలు విధ్వంసానికి గురికావడం అత్యంత ఆందోళనకరమని, స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీ యంత్రాలను ఉపయోగించి ధ్వంసం చేస్తున్నారని, తక్షణమే ఆ విధ్వంసం ఆపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు బుధవారం ఆయన వినతిపత్రం అందించారు. ఎర్రమట్టి దిబ్బలు పర్యావరణాన్ని పరిరక్షించేవి, రక్షణ రంగానికి రక్షణ కవచాలుగా ఉన్నాయని వివరించారు. చారిత్రాత్మకమైన ప్రకృతి సంపద అని, భూగర్భ జలాలను రక్షించేవని, జాతీయ భౌగోళిక వారసత్వ సంపదగా ప్రభుత్వం దీనిని గుర్తించిందని, వీటి ధ్వంసం వల్ల పర్యావరణానికి ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. అపారమైన ఈ సహజ సిద్ధ ప్రకృతి సంపద కొద్దిమంది వ్యక్తుల దాహానికి బలికావడం అత్యంత ఆందోళనకరమని, ప్రజలు, పర్యావరణవేత్తలు సైతం తీవ్ర ఆవేదనతో ఉన్నారని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ వెంటనే కలుగచేసుకొని ధ్వంసం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ ప్రకృతి సంపదను రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

ఎయు భూములపై సమగ్ర విచారణ జరపాలి

విశాఖ నగరంలోని ఆంధ్రా యూనివర్శిటీకి సంబంధించిన సుమారు 2.5 ఎకరాల భూములను స్వాహా చేయడానికి కొందరు రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సిద్ధపడుతున్నారని, ఎయు పోలమాంబ గుడి పక్కన 5 ఎకరాల భూమిలో గతంలో ప్రభుత్వం కొంతమంది పేదలకు కొంత భూమిని బదలాయించిందని, ఈ 5 ఎకరాల్లో పేదలకు కేటాయించగా మిగతా 2.5 ఎకరాల భూమిని క్రీడామైదానం కోసం ప్రభుత్వం కేటాయించినట్లు తెలిసిందని, వందల కోట్లు విలువైన ఈ భూమిని స్వాహా చేసి నిర్మాణాలు చేపట్టేందుకు కొంతమంది రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సిద్ధపడుతున్నారని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై కలెక్టర వెంటనే కలుగచేసుకొని ఎయు భూముల ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సంక్షోభం కాదు కేంద్రం కుట్రే

కృషితో విశాఖ స్టీల్ ప్లాంట్ దినదినాభివృద్ధి చెంది నేడు 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకుందన్నారు. మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఉత్పత్తిని తగ్గించే ప్రయత్నాలను మానుకొని స్టీల్ ప్లాంట్ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు.

మాజీ ఈడి ఫైనాన్స్ డైరెక్టర్ జిఎస్ఎన్ రావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించి ఉత్పత్తిని పెంచాలన్నారు. సెయిల్‌కు సొంత గనులు ఉన్నప్పటికీ అతి తక్కువ లాభాలతోనే నడుస్తోందని అయితే విశాఖ ఉక్కుకి సొంత గనులు కేటాయిస్తే అత్యధిక లాభాలతో ముందుకు దూసుకెళ్తుందని పేర్కొన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులకు కేటాయిస్తే రాష్ట్రంలో అత్యధిక లాభాలు తీసుకువచ్చే కంపెనీగా స్టీల్ ప్లాంట్ ఆవిర్భవిస్తుందన్నారు.

ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధుల ప్రధాన కార్యదర్శి కెవిడి.ప్రసాద్, సంయుక్త కార్యదర్శి నరసింహ తపన్‌సేన్‌ను కలిసి విశాఖ ఉక్కు సమస్యలకు శాశ్వత పరిష్కారంగా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో విలీనం చేయాలని కోరారు. ఈ విషయమై స్టీల్ ఎగ్జిక్యూటివ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి ఇచ్చిన విషయం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, రామస్వామి, గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం, డివిఆర్ ఎస్‌సి యూనియన్ నాయకులు డివి.రమణారెడ్డి, యూజ్ నాయకులు పరంధామయ్య, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి దిబ్బల విధ్వంసం ఆపాలి

కోరారు. ఎయు భూములు రక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కథనాలపై స్పందించిన అధికారులు

ఎంవిపి.కాలనీ : భీమిలి వద్ద ఉన్న ఎర్రమట్టి దిబ్బలు తవ్వకాలపై బుధవారం పత్రికల్లో వచ్చిన వార్తలపై అధికారులు స్పందించారు. ఈ భూములు జివిఎంసి పరిధిలోకి వస్తాయని, జివిఎంసి అధికారాల ప్రకారం నేరెళ్ల వలస గ్రామంలో అనుమతులు జారీ చేయటకు అనధికారిక అభివృద్ధి తదితరాలపై చర్యలు తీసుకోవడానికి జివిఎంసిమాత్రమే అధికారం ఉందని, భీమిలి మ్యూచువల్ కో-ఆపరేటివ్ బిల్డింగ్స్ సొసైటీకి విఎంఆర్‌డిఎ నుంచి ఎటువంటి అభివృద్ధి అనుమతులు జారీ చేయలేదని విఎంఆర్‌డిఎ ముఖ్య ప్రణాళిక అధికారి కె.సంజయ్ రత్నకుమార్ తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

డిఎస్‌పి కెవి.సత్యనారాయణ, ఎస్‌బి డిఎస్‌బి బి.అప్పారావు, ఎఆర్ డిఎస్‌పి పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, బుచ్చిరాజు, గణేష్, కుమారస్వామి, మన్మథరావు, సతీష్, నరసింహమూర్తి, సంజీవరావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

రవాణా కార్మికుల సమస్యలపై నేడు సదస్సు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రవాణా రంగ కార్మికుల సమస్యలపై గురువారం విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు తెలిపారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సదస్సులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, ఎఫ్ఐఆర్‌టి డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజాఫర్ అహ్మద్ ముఖ్య వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు బి.జగన్, ఆటో యూనియన్ నాయకులు గురుమూర్తి, సురేష్, ఎస్.శ్రీనివాసరావు, రాము, మసేన్, నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, పి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ల నాయకులు

హోటళ్లలో ఆహార భద్రత తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం ఆహార భద్రత అధికారి జివి.అప్పారావు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరంలోని పలు రెస్టారెంట్లపై బుధవారం దాడులు నిర్వహించామని విశాఖ సహాయక ఆహార నియంత్రణాధికారి జివి.నందాజీ తెలిపారు. బుధవారం సూర్య భాగ్ చిత్రాలయ కాంప్లెక్స్ సైన్ ట్రైన్ రెస్టారెంట్, వివిపి రోడ్‌లో వైజాగ్ కెమిస్ట్రీ హోటల్స్‌లో నిర్వహించిన తనిఖీలో నూనెను టిపిసి మీటర్ ద్వారా తనిఖీ చేశారు. టిపిసి వాల్యూ 36.5 శాతం ఎక్కువ ఉన్నందున ఈ నూనెలను ఆహార పదార్థాలు ఫ్రై చేయుటకు వినియోగించరాదని హోటల్ యాజమాన్యాన్ని హెచ్చరించామన్నారు. ఈ నూనెను వినియోగించడం వల్ల కేన్సర్, జీర్ణ కోశ సంబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆహార భద్రత, ప్రమాణాలు 2011 యాక్ట్ ప్రకారం ఆయా హోటల్స్‌పై కేసు నమోదు చేసి రూ.2 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. వినియోగదారులు నూన లో బాగా ఫ్రై చేసిన ఆహార పదార్థాలు తినకూడదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ తనిఖీలలో నగరంలోని పలు జోన్‌లకు చెందిన ఆహార భద్రతా అధికారులు ఎస్.ఆనంద్ రావు, పి.శ్రీనుపాల్గొన్నారు.

వివాహ కాలానికి సంప్రదాయ భారతీయ వస్త్రాలు



ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాబోయే వివాహ వేడుకలను ప్రతి ఒక్కరూ నూతన వస్త్ర ధారణతో ఒక పండుగ వాతావరణ అనుభూతిని పొందుతారని, వివాహ వేడుకలను మరింత ఘనంగా జరుపుకొనుటకు దేశం నలుమూలల నుంచి సేకరించిన మగ్గాలపై నేసిన అన్ని రకాల సంప్రదాయ వస్త్రాలను ఒకేచోట అందించుటకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఆధ్వర్యాన గ్రీన్ పార్క్ హోటల్‌లో 5 రోజుల పాటు విస్తృత శ్రేణి వస్త్రాలు, ఉపకరణాలతో ఎక్స్ పో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ, నేషనల్ సిల్క్ ఎక్స్‌పోను దర్శించటం అంటే భారతదేశంలోని నేత సంప్రదాయాల చుట్టూ యాత్ర చేసినట్లే అన్నారు. దేశంలోని విభిన్న ప్రాంతాల నేత కార్మికులు అందరూ తమ వేలాది రకాల పట్టు, కాటన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు తదితరాలను ఒకేచోట ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సిల్క్ ఎక్స్ పోలో 50 శాతం తగ్గింపుతో నేరుగా విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనలో మహారాష్ట్ర వారి పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక బెంగళూరు సిల్క్స్, సాఫ్ట్ సిల్క్స్, కాషిదా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్‌కు చెందిన చందేరి, మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్ బలూచారి, జమదాని, టాంగైల్, ఢకాయ్ సిల్క్ వస్త్రాలు, లినెన్ కాంతా వర్క్ స్టిచ్ చీరలు ఈ ప్రదర్శనలో లభిస్తాయన్నారు.

ఈ ఎక్స్‌పోలో చీరలు, దుపట్లు, వివిధ డిజైన్స్ సల్వార్ మెటీరియల్స్ నమూనాలు ఉన్నాయని, వీటిలో బీహార్ టస్సార్, మట్కా, భాగల్పూర్ సిల్క్స్, గుజరాత్ సంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోలా, తమిళనాడు కంజీవరం పట్టు చీరలు, జమ్మూ, తావి నుంచి వచ్చిన ఎంబ్రాయిడరీ సిల్క్స్, తాబీ సిల్క్ చీరలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉత్తరప్రదేశ్ బనారస్ పట్టు చీరలు, జమదాని, సిఫాన్ చీరలు, లక్నవి చికాన్ వర్క్ చీరలు, రాజస్థాన్ నుంచి తెచ్చిన బంధిని, బందేజ్, హేండ్ బ్లాక్ ప్రింట్లు ఈ ప్రదర్శనలో ఉన్నాయని వివరించారు. ఈ ప్రదర్శన 21వ తేదీ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటలు వరకు నిర్వహిస్తున్నామన్నారు. ప్రవేశం ఉచితమని, అన్ని రకాల డెబిట్, క్రెడిట్ కార్డులు స్వీకరిస్తామని తెలిపారు.

నైతికతను విజయసాయిరెడ్డి నిరూపించుకోవాలి

తెలుగుశక్తి అధ్యక్షులు బివి.రామ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వచ్చిన ఆరోపణలు నిజమో కాదో నిరూపించుకోవాల్సిన బాధ్యత విజయసాయి రెడ్డిపైనే ఉందని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ అన్నారు. విజయసాయిరెడ్డి మీడియా సమావేశంలో విలేకర్లపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయటాన్ని ఖండిస్తూ బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తెలుగు శక్తి ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపిలో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తర్వాత అంతటి స్థాయి కలిగి ఉన్న నేత విజయసాయిరెడ్డి అని, ఆయనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని తేల్చి చెప్పేందుకు డిఎన్ఎ పరీక్ష చేయించుకుంటే సరిపోతుందని తెలిపారు. డిఎన్ఎ పరీక్ష చేయించుకోకుండా తాను ఎంతో నైతికత ఉన్నట్టుగా మీడియాపై అవాకులు చవాకులు మాట్లాడడం సరికాదన్నారు. విజయసాయిరెడ్డి తన పెద్దరికం మరిచి మీడియాపై ఇష్టానుసారంగా మాట్లాడడం సరికాదన్నారు. తాను మీడియాకు సంఘీభావం ప్రకటిస్తున్నానని తెలిపారు.

20న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు రాక

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జె.హుస్సేన్‌నాయక్ ఈ నెల 20 తేదీన ఉదయం 10 గంటలకు విశాఖపట్నం రానున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ తెలిపారు. మధ్యాహ్నం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం, సాయంత్రం 5 గంటలకు ఎంవిపి గిరిజన భవన్‌లో ఎస్టీ కమిషన్ సభ్యులతో చర్చా గోష్టి సన్నాన కార్యక్రమం ఉంటాయని పేర్కొన్నారు. గిరిజన ఉద్యోగులు వ్యక్తిగత, సంఘ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

విశాఖలో అయోధ్య వినాయకుడు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖలో మరో అయోధ్య వినాయకుడు కొలువుదీరనున్నాడు. వినాయక చవితి సంబరాల్లో భాగంగా 'యూత్ ఐకాన్' షాపింగ్ మాల్ అధినేత రాజు ఈ సారి అయోధ్య రామ మందిరంలోని వ్యర్థాలతో నిర్మించిన వినాయకుడిని ప్రతిష్ఠించనున్నారు. గతేడాది 'చాకొలెట్ వినాయకుడిని' రూపొందించిన ఆయన ఈ సంవత్సరం అప్పుఘర్ వద్ద ఉన్న విష్ణుకుమార్ రాజు గ్రౌండ్స్‌లో శ్రీఅయోధ్య రామమందిరం సెట్ పేరిట ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఏకాదశి సందర్భంగా బుధవారం కర్ర పూజ ఏర్పాట్లు ప్రారంభించారు.

ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలు నిలిపివేత

ప్రభుత్వ భూమి రక్షణకు తనిఖీ బృందాలు
ఎంఆర్ఐ, విఆర్ఒలకు షోకాజ్ నోటీసులు
ఆర్‌డిఒ భాస్కరరెడ్డి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో ఎటువంటి అనధికార కార్యకలాపాలు జరగకుండా రెవెన్యూ సిబ్బందితో తనిఖీ బృందాలు ఏర్పాటు చేసినట్లు స్థానిక ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడ్డి తెలిపారు. ప్రజాశక్తిలో 'ఎర్ర మట్టి దిబ్బల విధ్వంసం' కథనానికి స్పందిస్తూ విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో తవ్వకాలను నిలిపివేసినట్లు తెలిపారు. అక్కడ ప్రభుత్వ భూమిలో అనధికార పనులను గుర్తించి, అడ్డుకోవడంతోపాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎంఆర్ఐ, నేరెళ్ళవలస విఆర్ఒకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు జివిఎంసి ఒకటో జోన్, తోటవీధి వార్డు సచివాలయం ప్లానింగ్ సెక్రెటరీ కాగిత అజయ్ కుమార్‌ను సస్పెండ్ చేసేలా జివిఎంసి అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు ఆర్‌డిఒ తెలిపారు.

వృద్ధాప్య పింఛను ఇచ్చి ఆదుకోండి



పల్లాకు వినతిపత్రం ఇస్తున్న ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగులు

ప్రజాశక్తి- గాజువాక : విశ్రాంత ఉద్యోగులకు ఆర్‌టిసి ఇచ్చే నామమాత్రపు పెన్షన్‌తో కుటుంబంతో జీవనం కష్టమౌతోందని, తమకు ఎన్‌టిఆర్ భరోసా కింద ఇచ్చే సామాజిక పింఛన్‌కు అర్హులుగా గుర్తించి, పెన్షన్ అందజేసి ఆదుకోవాలని ఎపిఎస్‌ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కోరారు. బుధవారం గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. 2014నుంచి ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగులకు ప్రతినెలా కేవలం రూ.వెయ్యి మాత్రమే పెన్షన్ ఇస్తున్నారని, దీనిపై గత ప్రభుత్వానికి పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందించలేదన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై గాజువాక ఎమ్మెల్యే పల్లా స్పందిస్తూ, సమస్యను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వివికె రాయ్, ప్రధాన కార్యదర్శి కెఆర్ ఆంజనేయులు, కెవిఆర్‌కె ప్రసాద్ ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆర్‌టిసిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎపిపిటిడి (ఆర్‌టిసి) రాష్ట్ర ప్రసార కార్యదర్శి బి మధుసూదనరావు కోరారు. బుధవారం విశాఖఉత్తరఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కలిసి విన్నవించారు. ఆర్‌టిసిలో రెండు దశాబ్దాలుగా 7300 అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వివిధ విభాగాల్లో రెగ్యులర్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నారని, వారికి సమాన వేతనంగానీ, ఉద్యోగ భద్రత గానీ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రమాద బీమా కల్పిస్తూ, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, మహిళా ఉద్యోగులకు మెటర్నటీ లీవ్ కల్పించాలని కోరారు. వీరికి వారాంతపు సెలవులతోపాటు ప్రభుత్వ సెలవు దినాలు వర్తించేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్పందించి, సమస్యను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. సిఐటియు నేతలు పడాల గోవింద్, కిరణ్, మోహన్, సతీష్, శ్రీను.పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -తగరపువలస : ఈ నెల 19న చిట్టివలస 33 కెవి పరిధిలోని తగరపువలస మెయిన్ రోడ్డు, చిట్టివలస, కొత్తపేట, కొండపేట, సంత పేట, బంగ్లామెట్ట, గణేష్ థియేటర్ రోడ్డు, ఆదర్శ నగర్, జ్యూట్ కార్మికవాడ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ డిఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.

ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలపై విచారణ

ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే గంటా


ఎర్ర మట్టి దిబ్బల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగోవార్డు నేరెళ్లవలసలో సహజసిద్ధ ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలపై కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరినట్లు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు ఎర్ర మట్టి దిబ్బల విధ్వంసంపై స్పందిస్తూ, బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం అక్కడ జరుగుతున్న పనులను నిలిపి వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎర్ర మట్టి దిబ్బల ప్రాంతాన్ని తమకు కేటాయించినట్లుగా చెబుతున్న భీమునిపట్నం మ్యుచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ భూములను, జియో హెరిటేజ్ భూములను గుర్తించి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

అధికారుల పరిశీలన

స్థానిక ఎమ్మెల్యే పర్యటనకు ముందు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, భీమిలి ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడ్డి, తహశీల్దార్ టి గోవింద ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో పర్యటించారు

గీతం ప్రవేశాలకు అనూహ్య స్పందన


గీతం ప్రవేశాల కౌన్సిలింగ్‌కు వచ్చిన విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ: గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులలో ప్రవేశాలకు అనూహ్య స్పందన కనిపిస్తోంది. బుధవారం ప్రవేశం పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన, అవగాహన తరగతులను నిర్వహించారు. గీతంలో ఇంజనీరింగ్, మేనేజ్మెంట్, లా, ఆర్కిటెక్చర్, మెడికల్, పారామెడికల్, ఫార్మసీ, నర్సింగ్, ఫిజియోథెరిపి వంటి వృత్తి విద్యాకోర్సులతో పాటు బిఎస్‌సి, బిఎ, బికామ్ వంటి డిగ్రీ కోర్సులలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఈ అవగాహన తరగతులను నిర్వహించారు.

ఈ సందర్భంగా గీతం ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు మాట్లాడుతూ, నూతన విద్యా విధానానికి అనుగుణంగా గీతం కోర్సుల రూపకల్పనతోపాటు నిపుణులతో విద్యాబోధన సాగుతుందన్నారు.ప్రతిభ చూపిన విద్యార్థులకు ఏటా రూ.50 కోట్ల ఉపకారవేతనాలను అందజేస్తున్నామన్నారు. వర్సిటీలో రూ.వంద కోట్లతో నూతన సాంకేతిక పరిజ్ఞానం అధునాతన ప్రయోగశాలలతో పాటు, ప్రవేశం నుంచి డిగ్రీ అందుకుని వెళ్ళేంతవరకు మార్గదర్శకం చేసేలా గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యార్థులలో స్టార్టప్ సంస్కృతిని పెంచడానికి వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఉందన్నారు. గీతం ఎక్స్టర్నల్ రిలేషన్స్ డిప్యూటీ డైరక్టర్ నవీన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లక్ష మంది పైగా గీతం పూర్వ విద్యార్థులు కీలక పదవులలో ఉన్నారని, ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకం చేయడానికి వారి సహకారం తీసుకుంటున్నామన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ అడ్మిషన్ల విభాగం అధికారులు, సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

బుధవారం నిర్వహించిన అవగాహనలో ఇంటర్మీడియట్ తత్సమాన కోర్సులు పూర్తి చేసిన వారికి బిఎస్‌సి బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, స్టాటస్టిక్స్, బిపిటి, ఫిజియోథెరిపి, బిఫార్మశీతో పాటు బిఎ ఎల్ఎల్‌బి, బిబిఎ, బిఎలో ఎకనామిక్స్, హిస్టరి, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, సోషియాలజి కోర్సులు మేజర్, మైనర్ సబ్జెక్టుల ఎంపిక, గీతంలోని వివిధ సదుపాయాలను ఆయా విభాగాధిపతులు, సీనియర్ ప్రొఫెసర్లు

రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విధాన నిర్ణయాలు

ప్రజాశక్తి- మాధవధార : రాష్ట్రం, భావితరాల భవిష్యత్‌కు ఉపయోగపడేలా సరైన నిర్ణయాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగించాలని రాష్ట్ర కాంగ్రెస్ ఒబిసి విభాగం ఛైర్మన్ మూల వెంకటరావు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల దృష్ట్యా పాలనలో ప్రయోగాలు చేసే సాహసం చేయకుండా, తనకున్న సుదీర్ఘ రాజకీయ అనుభవంతో మేధావులు, నిపుణుల సలహాలు సూచనలతో మెరుగైన పాలన అందించేందుకు కృషి చేయాలన్నారు. యువతకు, సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యతనిచ్చి మంత్రివర్గంలో పాత కొత్త కలయికలకు చోటు కల్పించడం అభినందనీయమన్నారు. ఇదే సమయంలో వారితో సమర్థవంతంగా పనిచేయించే బాధ్యత అనుభవజ్ఞుడిగా చంద్రబాబు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వ సలహాదారులు, సీనియర్ అధికారుల సహకారం తీసుకోవాలని కోరారు.

ఉచిత ఇసుకకు భలే డిమాండ్!

ఆధార్ కార్డుపై రోజుకు 20 టన్నులు


భీమిలి, కృష్ణా కాలనీ స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లోడింగ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఉచిత ఇసుక సరఫరా వేగవంతంగా జరుగుతోంది. స్థానిక కృష్ణా కాలనీలో ఉన్న స్టాక్ పాయింట్ నుంచి ఈనెల 6నుంచి రోజూ 150 టన్నుల ఇసుక సరఫరా అవుతుంది.ఇసుక కావాల్సిన వారు జిఎస్‌టి,లోడింగ్, రవాణా ఇతర ఛార్జీలను కలుపుకుని టన్నుకు రూ 758 స్టాక్ పాయింట్ వద్దనే చెల్లించి ఇసుక తీసుకెళ్తున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు స్టాక్ పాయింట్ నుంచి ఉచిత ఇసుకను పొందవచ్చు. ఒక ఆధార్ కార్డుపై రోజుకు 20 టన్నుల ఇసుక పొందవచ్చనేది నిబంధన.

రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక విధానం అమలు చేసే నాటికి ఇక్కడి స్టాక్ పాయింట్‌లో 94 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. శ్రీకాకుళం నుంచి ఇక్కడి స్టాక్ పాయింట్ కు ఇసుక సరఫరా అవుతుంది.ఉచిత ఇసుకకు లారీలు క్యూలో ఉండడాన్ని బట్టి దీని డిమాండ్ స్పష్టమౌతోంది. ఇక్కడి స్టాక్ పాయింట్ వద్ద ఇసుక పంపిణీ పర్యవేక్షణకు భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల రీసర్వే డిటిలు లక్ష్మీ కుమారి, శ్రీనివాసరావు, వరలక్ష్మిని ఉన్నతాధికారులు నియమించారు.

నేరాలు - ఘోరాలు

వివాహిత ఆత్మ హత్య

ప్రజాశక్తి-తగరపువలస: జివిఎంసి ఒకటో వార్డు కొండపేటలో అద్దింట్లో నివాసముంటున్న వివాహిత శాబ్ హుక్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి సంబంధించి ఎస్ఐ జి.హరీష్ చెప్పిన వివరాలివి.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, ముర్షిదాబాద్‌కు చెందిన మధుమిత ఘోష్ (21), భర్త తినుకుమార్ ఘోష్, నాలుగేళ్ల కుమార్తెతో కలిసి బతుకు కోసం తొమ్మిది నెలల క్రితం తగరపువలస వచ్చారు..కొండపేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. తినుకు కుమార్ ఘోష్ స్థానికంగా ఉన్న ఓ మిఠాయి తయారీ దుకాణంలో కుక్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా దంపతుల మధ్య చిన్నపాటి మనస్పర్ధలు తలెత్తాయి. దీంతో ఇరువురి మధ్య మాటా మంతీ లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న బుధవారం ఉదయం 6గంటలకు భర్త తినుకుకుమార్ ఘోష్ వాష్ రూమ్ నుంచి బయటకు వచ్చేసరికి భార్య మధుమిత ఘోష్ నిద్రిస్తున్న బెడ్ రూమ్‌లో సెల్ అలారం మోగుతున్నా తీయకపోవడంతో చేరేసి వున్న తలుపు తెరిచేసరికి ఆమె మెడకు చీర బిగించి ఇంటి స్లాబ్ హుక్కుకు మధుమిత వేలాడుతూ కనిపించింది. నిర్ఘాంతపోయిన భర్త, మిఠాయి దుకాణం మేనేజర్ సురేష్‌కు, సహచర కార్మికులకు తెలియజేసి, వారి సాయంతో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - యలమంచిలి : తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని నర్సింగబిల్లి, బయ్యవరం స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై బుధవారం ఉదయం 6 గంటల సమయంలో 45 - 50 సంవత్సరాల వయసుగల పురుషుని మృతదేహం లభ్యమైందని రైల్వే పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మృతుని పేరు వివరాలు తెలియరాలేదన్నారు. సిమెంట్ రంగు షర్టు ధరించిన మృతునికి పది అడుగుల దూరంలో నీలం రంగు టీ షర్టు ఉందని, దానిపై పెన్ను సిమ్మంట్ అన్న ముద్ర ఉందని పేర్కొన్నారు. మృతదేహాన్ని తుని గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు ఆయన వివరించారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94948 87786 మొబైల్ నెంబర్‌కు సంప్రదించాని వారు కోరారు.

రెండు ఇసుక లారీలు పట్టివేత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : రాజమండ్రి నుంచి నర్సీపట్నంకు ఇసుక తరలిస్తున్న ఒక టిప్పర్, మరో 12 టైర్ల లారీని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (ఎస్.ఇ.బి.) అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఈ లారీలను సీజ్ చేసి నర్సీపట్నం ఎస్ఇబి స్టేషన్‌కు తరలించారు. 12 టైర్ల లారీకి రూ.50 వేలు, 10 టైర్ ల టిప్పర్ కు 25 వేల చొప్పున అపరాధ రుసుం విధించామని ఎస్ఇబి సీఐ సురేష్ కుమార్ తెలిపారు.

ఉచిత ఇసుక పేరుతో తరలింపు

ఇదిలా ఉండగా రాజమండ్రి ఇసుక రీచ్ వద్ద ఆధార్ కార్డు చూపించి టన్ను ఇసుకకు రూ.275 చెల్లించి, ఇసుకను కొనుగోలు చేసి, తీసుకు వస్తున్నట్టు తెలిసింది. రవాణా చార్జీలు కలుపుకొని ఇక్కడ విక్రయిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం పేరుతో నిర్మాణాలు చేసుకునే వారికి వెసులుబాటు కల్పించింది. ఎవరైనా భవన నిర్మాణాలు చేసుకుంటే, వారి ఆధార్ కార్డు చూపిస్తే, వారికి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తారు. రాజమండ్రి గోదావరి ఇసుక రీచ్‌లో ఆధార్ కార్డు చూపించి ఇసుకను కొనుగోలు చేసి వాహన యజమానులు నర్సీపట్నం తరలిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం మూడు ట్రాక్టర్ల ద్వారా ద్వారా ఇసుకను నర్సీపట్నం తరలిస్తుండగా వాటిని కూడా ఎస్ఇబి అధికారులు పట్టుకున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. పదివేల అపరాధ రుసుం విధించారు.

ఆనంద గజపతిరాజుకు ఘననివాళి

ప్రజాశక్తి- సింహాచలం : సింహాచలం దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త, ఆనంద గజపతిరాజు 75వ జయంతిని ఆలయ పరిపాలనా భవనంలో బుధవారం ఆలయ ఇఒ ఎస్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు ఆనందగజపతిరాజు చిత్రపటానికి సుధా గజపతిరాజు, కుమార్తె ఊర్మిళ గజపతిరాజు, ఆలయ ఇఇలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఎఇఒలు రమణమూర్తి, రాజేంద్రకుమార్, ఎఇ హరిరాజు పర్యవేక్షణాధికారి సునీల్ తదితరులు పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు కార్యక్రమంలో దేవాలయ పరిపాలన భవన ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యత

గాజువాక డిసిపి తుహిన్ సిన్హా బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న డిసిపి

ప్రజాశక్తి -గాజువాక: మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యతనిచ్చి చర్యలు తీసుకుంటానని గాజువాక జోన్ డిసిపి -2 తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. బుధవారం స్థానిక పోలీస్ కాంప్లెక్స్‌లో డిసిపిగా బాధ్యతలు స్వీకరించారు. 2017 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన తుహిన్ సిన్హా ఉత్తరప్రదేశ్ లక్నోకు చెందినవారు. అల్లూరి జిల్లా ఎస్‌పిగా పనిచేస్తూ, గాజువాక డిసిపిగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, విశాఖకు వివిధ మార్గాల ద్వారా వచ్చే గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నగర శివార్లతో ముమ్మర తనిఖీలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు ఎసిపిలతోపాటు సిఐలు,ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

వంటగ్యాస్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : వంటగ్యాస్ వినియోగంపై చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో బుధవారం సిబ్బంది అవగాహన కల్పించారు. భీమిలికి చెందిన పివి రమణయ్య హెచ్‌పి గ్యాస డీలర్, యాజమాన్య ప్రతినిధి సీతారామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వంట గ్యాస్ వాడకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇకెవైసి, హెచ్‌పి పేయాప్ ద్వారా మొబైల్ నుంచి ఎలా నమోదు చేసుకోవచ్చునో అవగాహన కల్పించారు వినియోగదారులకు ఇకెవైసి చేశారు. బట్టర్‌ఫ్లై వంట గ్యాస్ టాప్‌స్టౌ కొనుగోలుదారులకు ఎక్స్ఛేంజ్ ఆఫర్ సదుపాయం కలిగించారు. కార్యక్రమంలో మెకానిక్‌లు వెంకటేష్, మహేష్, చిరంజీవి పాల్గొన్నారు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ: జివిఎంసి ఆరోవార్డు బక్కన్నపాలెం ఇండోర్ సబ్‌స్టేషన్, శంభువానిపాలెం 11కెవి ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు, ఇతర నిర్వహణ పనుల దృష్ట్యాపై గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ డిఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బక్కన్నపాలెం, ఎన్‌టిఆర్ కాలనీ, లచ్చిరాజు లేఅవుట్, రైల్వే లేఅవుట్, సిఆర్‌పిఎఫ్ పోలీస్ బెటాలియన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

పిఎం పాలెం : ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ ఆపరేషన్స్ విభాగం పరిధిలోని పిఎం పాలెం 11కెవి ఫీడర్‌లో మరమ్మతులు, ఇతర నిర్వహణ పనుల దృష్ట్యా గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సబ్‌స్టేషన్ ఎఇఇ మండల అప్పలనాయుడు తెలిపారు. సాంకేతిక కళాశాల పోస్టాఫీస్, కారుషెడ్, ఎపిహెచ్‌బి కాలనీ, గాయత్రి నగర్, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, రెండో బస్ స్టాప్, విజేత సూపర్ మార్కెట్ తదితర ప్రాంతాలో కరెంట్ ఉండదని వినియోగదారులు గమనించాలని కోరారు.

రోడ్డుపైనే మురుగునీరు

ప్రజాశక్తి-సీతమ్మధార: జివిఎంసి 25, 27వార్డుల్లో డ్రైనేజీల్లోని మురుగునీరు పొంగి రోడ్డపై ప్రవహిస్తుండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 27వ వార్డులో పాఠశాల వద్దనున్న డ్రైనేజీ పొంగిపోవడంతో అటువైపుగా ప్రయాణించే వాహనదారులు పాదచారులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో అపారిశుధ్యంతోపాటు దుర్గంధంతో అల్లాడిపోతున్నారు. అలాగే 25వ వార్డు క్రౌన్ బేకరీ వెనక డ్రైనేజీ నుంచి ఐదురోజులుగా మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జివిఎంసి యంత్రాంగం స్పందించి, డ్రైనేజీల్లోని మురుగునీరు రోడ్డుపై పారకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


తారురోడ్డుపైనే పారుతున్న డ్రైనేజీల్లోని మురుగునీరు

వేతన బకాయి చెల్లించాలని క్లాప్ డ్రైవర్లు,లోడర్లు మెరుపు సమ్మె


క్లాప్ డ్రైవర్ల నిరసనలో పాల్గొన్న సిఐటియు నేత వెంకటరెడ్డి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : క్లాప్ డ్రైవర్లకు, లోడర్లకు కాంట్రాక్టర్లు జీతాలు చెల్లించలేదని, పిఎఫ్, ఇఎస్ఐ జమ చేయటం లేదని నిరసన తెలుపుతూ బుధవారం మెరుపు సమ్మె చేశారు. ఈ సందర్భంగా జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, 2021 నుంచి కార్మికులకు పిఎఫ్ కేవలం రూ.నాలుగైదు వేలు మాత్రమే జమ చేయడం, ఇఎస్ఐ చందా చెల్లించకపోవడంతో వైద్యం పొందలేకపోవడం, బ్యాంక్ అకౌంట్లు, పిఎఫ్, ఇఎస్ఐ కోడ్లను విజయవాడ నుంచి విశాఖకు మార్చకపోవడం, లేబర్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చినా రూ.18,500 జీతం అమలు చేయకపోవడం వంటి తప్పిదాలకు కాంట్రాక్టర్లు పాల్పడుతున్నారని విమర్శించారు. దీనిపై కమిషనర్ ఇన్‌ఛార్జ్, జివిఎంసి పాలక వర్గం స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అర్ అండ్ బి వద్ద క్లాప్ వెహికిల్ యార్డ్‌లో కార్మికులు నిరసన తెలిపారు. క్లాప్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు పి.అనిల్‌కుమార్, శ్రావణ్, బి.స్వామి, ఎం.సాదు, సంతోష్ పాల్గొన్నారు.

మధురవాడ : బకాయి పడ్డ ఆరునెలల వేతనాన్ని వెంటనే చెల్లించాలని ఎంసి 5 నుంచి 8 వార్డుల పరిధిలోని క్లాప్ కార్మికులకు బుధవారం ఏడోవార్డు ద్రోణంరాజు కల్యాణమండపం వద్ద నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. వీరి ఆందోళనకు సిఐటియు మధురవాడ జోన్ ఉపాధ్యక్షులు డి అప్పలరాజు అప్పలరాజు సంఘీభావం తెలిపారు.. ఆందోళన విషయం తెలుసుకున్న ఎంఎంహెచ్‌ఒ డాక్టర్ కిషోర్ అక్కడకు చేరుకుని కాంట్రాక్టర్లతో చర్చించారు. వేతన బకాయిలపై ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి, వారం రోజుల్లో వేతన బకాయి చెల్లింపునకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఆందోళనలో సత్యనారాయణ, టి వెంకటరమణ, కె లక్ష్మి, వై రమణ, లక్ష్మీనరసింహ, డి రాము, కళ్యాణ్ పాల్గొన్నారు.

గాజువాక : వేతన బకాయి చెల్లించలేదని నిరసిస్తూ జివిఎంసి గాజువాక జోన్ పరిధిలోని క్లాప్ డ్రైవర్లు, లోడర్స్ బుధవారం వాహనాలను నిలిపేసి ఆందోళన చేపట్టారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో యూనియన్ నేత గొలగాని అప్పారావు మాట్లాడుతూ, డ్రైవర్ల జీతా నుంచి కట్‌చేస్తున్న ఇఎస్ఐ, ఇపిఎస్ వాటా సొమ్మును ఆయా సంస్థలకు జమ చేయడం లేదన్నారు. జీతాలు చెల్లించిన తర్వాత మళ్లీ విధుల్లోకి చేరతామంటూ ఆందోళనకు దిగి వాహనాలను నిలిపేశారు.


అనకాపల్లిలో నిరసన చేపడుతున్న క్లాప్ డ్రైవర్లు, లోడర్స్

అనకాపల్లి : క్లాప్ వాహనాల లోడర్ల కార్మికుల జీతాలు చెల్లించాలని కోరుతూ జీవీఎంసీ క్లబ్ వాహనాల యార్డు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఫిబ్రవరి నెలలో అనకాపల్లి జోన్‌లో 27 మందిని నియమించారని, మూడు నెలలుగా కాంట్రాక్టర్ జీతాలు చెల్లించడం లేదని, కార్మికుల నుండి కోత విధించిన పిఎఫ్, ఈఎస్ఐ నెంబర్లు నేటి వరకు ఇవ్వలేదని ఆరోపించారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అనకాపల్లి గౌరవ అధ్యక్షులు గంట శ్రీరామ్, నాయకులు వై.వరప్రసాద్, ఎస్.భారతి, బి.అప్పారావు పాల్గొన్నారు.

రెండోరోజుకు రైల్వే ఒబిహెచ్ఎస్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న రైల్వే కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : సౌముఖ్ యాజమాన్యం తమకు బకాయి పడ్డ నాలుగు నెలల వేతనం తక్షణమే చెల్లింపుతోపాటు, 45ఏళ్ల వయస్సు నిబంధనను సడలించాలని కోరుతూ డిఆర్ఎం కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో రైల్వే ఒబిహెచ్ఎస్ కార్మికులు చేపడుతున్న ధర్నా బుధవారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైల్వేలో కాంట్రాక్ట్ విధానం రద్దుచేసి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రైల్వే కార్మికులను తీవ్ర దోపిడీ చేస్తున్న బిజెపి, ప్రధాని మోడీ విధానాలు దుర్మార్గమంటూ నిరసన నినాదాలు చేశారు. తమకు వేతన బకాయి చెల్లింపుతోపాటు అరవై ఏళ్ల వరకు పనిలో కొనసాగించాలని, దినసరి కనీస వేతనం రూ. 734 రూపాయలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం రైల్వే సీనియర్ డిఎంఇకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్ట్ కార్మిక సంఘం సిఐటియు జిల్లా సెక్రెటరీ ఒ.అప్పారావు, పెసిడెంట్ జి శ్రీనివాసరావు, హరి, రాముడు, లక్ష్మణ్, ఆనంద్, కిరణ్, కన్నబాబు పాల్గొన్నారు

గిరి ప్రదక్షిణ భక్తులకు ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఈ నెల 20న సింహగిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు అవసరమైన వైద్యసాయం అందించేందుకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పోర్టు స్టేడియం వెనుక రోడ్డులో వినాయక రెసిడెన్సీ వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రేటర్ విశాఖ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎమ్‌డి. యాసిన్ తెలిపారు. బుధవారం ద్వారకానగర్‌లోని తన కార్యాలయంలో మీడియాకు వివరాలను వెల్లడించారు. వీ హెల్త్ కేర్, ఏజ్ కేర్ ఫౌండేషన్, ఎరుమేలు శ్రీ అయ్యప్ప అన్నసమారాధన సేవా ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో 30 మంది వైద్యులు, సిబ్బందిని మూడు 3 వైద్య బందాలుగా ఏర్పాటుచేసి, 12 గంటల పాటు నిర్విరామంగా వైద్య సేవలు అందించేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఆరోగ్య పరీక్షల తోపాటు ఉచితంగా మందులు అందజేస్తామని, అత్యవసర పరిస్థితిల్లో మెరుగైన ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్స్ సర్వీసును అందుబాటులో ఉంచుతామన్నారు. భక్తులకు వైద్య సేవలు అందించేందుకు పలువురు డాక్టర్లు, వైద్య సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, ఫిజియోథెరపిస్టుల సేవలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చింతా నేతాజీ, కమ్యూనిటీ మెడికల్ సర్వీసు డైరెక్టర్ డా. ఎన్. ఎస్. రాజు, రోటరీయన్స్ శంకర్, కే.ఎమ్. కే. రమేష్, వి.ప్రవీణ్, సూర్య తేజ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిన్నపాటి వర్షానికే విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : చిన్నపాటి వర్షానికే ఆనందపురం కూడలిలో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుంది. వర్షం గాలులు వేసిన ప్రతిసారీ ఇలా జరగడంతో వ్యాపారస్తులు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాలు తగ్గిన వెంటనే విద్యుత్ అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టి వదిలేస్తున్నారు. విద్యుత్ వైర్లు అనుకొని ఉన్న కొమ్మలను తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. బుధవారం పడిన చిన్నపాటి వర్షానికి ఆనందపురం అమృత రెస్టారెంట్ అండ్ బార్ ఎదురుగా ఉన్న వేపచెట్టు కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెద్ద శబ్దం వచ్చి విద్యుత్ నిలిచిపోయింది. ఇప్పటికైనా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

నిత్యాన్నదానానికి వితరణ


విరాళం చెక్కు అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి సూరిబాబు

ప్రజాశక్తి - ఆనందపురం: సింహాచలం వరహా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి ఆనందపురం గ్రామ సర్పంచ్ చందక లక్ష్మి, సూరిబాబు దంపతులు బుధావరం రూ.లక్ష, 1,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ తన మనవరాలు విద్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా ముందస్తుగా దేవస్థానానికి విరాళంగా అందజేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆలయ సూపరెంటిండెంట్ కుమార్‌కు విరాళం చెక్కు అందజేశామన్నారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలపై వినతి



పల్లాకు వినతిపత్రం ఇస్తున్న అప్సా నాయకులు

ప్రజాశక్తి -గాజువాక: రాష్ట్రంలో చిన్న పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల సంఘం (అప్సా) ఉత్తరాంధ్ర నాయకులు కోరారు. బుధవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు అనంతరం సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల గుర్తింపు రెన్యువల్ కాలపరిమితిని గతంలో మాదిరిగా పదేళ్లకు పొడిగించాలని, విద్యాహక్కు చట్టం ద్వారా గడచిన మూడేళ్లలో ప్రైవేటు బడుల్లో ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, మారిన పదవ తరగతి సిలబస్‌ను విద్యార్థుల ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని తగ్గించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే పల్లా స్పందిస్తూ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అప్సా సంఘం నాయకులు ఎం.జనార్ధన్, టి. సింహాచలం, పి. భాస్కరరావు, రామకృష్ణ, గణపతిరావు, సత్యం, మురళీ, శ్రీనివాస్, రమేష్ ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు పిఆర్‌సి వెయిటేజీపై ఆలోచించాలి

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకరరావు, కోటేశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి

విద్యుత్ ఉద్యోగులకు పిఆర్‌సి వెయిటేజీపై ప్రభుత్వం ఆలోచించి సానుకూలంగా స్పందించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకరరావు, జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) విశాఖపట్నం రీజియన్ కార్యవర్గ సమావేశం జరిగింది. రీజనల్ అధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యుత్ ఉద్యోగులు, జేఎల్ఎం గ్రేడ్ 2 ఎనర్జీ అసిస్టెంట్లు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యుత్ ఉద్యోగులకు ఇచ్చిన పిఆర్సి వల్ల వారికి తీవ్రమైన నష్టం జరిగిందన్నారు. ఫిట్మెంట్‌తో పాటు సర్వీస్‌ని బట్టి వెయిటేజ్, ఇంక్రిమెంట్లు ఇచ్చే వారని, గత ప్రభుత్వం మాత్రం ఫిట్మెంట్ మాత్రమే ఇస్తూ వెయిటేజ్‌లు ఇవ్వలేదని గుర్తు చేశారు. 1999 తర్వాత విద్యుత్ సంస్థల్లో చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ ఈపిఎఫ్ టు జిపిఎఫ్ అమలు పరిచేటట్లు చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో కారుణ్య నియామకాలు ద్వారా ఇచ్చే ఉద్యోగులందరికీ నేరుగా రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చేటువంటి వేతనాలు ఇచ్చేవారని, ప్రస్తుతం కొత్త పేర్లు పెట్టి రెండు సంవత్సరాలు ట్రైనింగ్ పేరుతో కేవలం రూ.15000, రూ.18,500 వేతనం నిర్ణయించి ఇస్తున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ జీవోను వెంటనే రద్దు చేసి కారుణ్య రెగ్యులర్ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయస్సును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచడానికి పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రీజియన్ కార్యదర్శి ప్రేమ చంద్రశేఖర్, ఆర్ సత్యారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఎస్కేఎం జానీ తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ఆరు బయట ఫార్మా వ్యర్థ రసాయనాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పరవాడ : ఆరు బయట ఫార్మా వ్యర్థ రసాయనాలు డంపింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెదగంట్యాడ మండలంలో గంగవరం ప్రాంతంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు పట్టుబడ్డ ఫార్మా వ్యర్థ జలాల ట్యాంకర్ ఎక్కడ నుండి వచ్చిందో సమగ్ర విచారణ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా సముద్రంలో కలుపుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫార్మా యాజమాన్యాలు ఏ విధమైన శుద్ధి చేయకుండా సముద్రంలోకి ట్యాంకర్ల ద్వారా కాలవల్లోకి, చెరువుల్లోకి, ఆరుబయట పారబోస్తున్నారని, వీటిపై సమగ్ర విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు దొరికిన టాంకర్ ఏ ఫార్మా పరిశ్రమదో నిర్ధారించి ఆ పరిశ్రమను సీజ్ చేయాలని గనిశెట్టి విజ్ఞప్తి చేశారు.

తక్కువ ధరకు కందిపప్పు, బియ్యం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలో రైతు బజార్లు, పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాల వద్ద ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం తక్కువ ధరలకు నాణ్యమైన సరుకులు అందిస్తున్నట్లు చోడవరం పంచాయతీ ఈవో నారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ ధరలకు పంపిణీ కార్యక్రమాన్ని ఇటీవల చోడవరం శాసనసభ్యులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కందిపప్పు (దేశవాళీ) కేజీ 160కు, బియ్యం (స్టీమ్డ్ సోనా మసూరి) కేజీ రూ.49కు, బియ్యం (పచ్చి సోనా మసూరి) కేజీ రూ.48కు చోడవరంలో రిలయన్స్ మార్ట్, ఉప్పల వెంకటేశ్వరరావు, అమ్మన్న శెట్టి, వెంకటేశ్వర మర్చంట్స్ లక్ష్మీపురం, గోపాలరావు కిరాణా మర్చంట్ తదితర షాపుల్లో అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ఏపి కేబినెట్ మీటింగ్‌లో రద్దు చేయడం పట్ల మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ యాక్ట్ ప్రజల్లో అనేక భయాందోళన నెలకొల్పినట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్టర్ రద్దు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం గ్రామంలో సూరిశెట్టి రమణ (పాలు రమణ) (69) మంగళవారం అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుమార్తె తలకొరివి పెట్టింది. రమణ కొంతకాలంగా నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. మంగళవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకొని అంబలి తాగి 10 నిమిషాల్లోనే మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. రమణ కుమారుడు ఎస్ఎస్‌వివిఎస్ జనార్దన్ వృత్తిరీత్యా చండీగఢ్‌లో ఆర్మీ సైనికుడిగా పనిచేస్తున్నారు. తన తండ్రి మరణ వార్త తట్టుకోలేక అనారోగ్యానికి గురై హాస్పిటల్‌లో ఉండడంతో తండ్రి చివరి చూపు కూడా హాజరుకాలేకపోయాడు. దీంతో రమణ ఐదుగురు సంతానంలో రెండవ కుమార్తె వెంకటలక్ష్మి తన తండ్రికి తలకు పెట్టారు.

లైంగికదాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాష్ట్రంలో పోక్సో కేసులు పెరిగిపోవడాన్ని, ఆడబిడ్డలపై అత్యాచారాలు, లైంగిక దాడులు చేయడాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు ఇటీవల బాలలపై అత్యాచారాలు, వేధింపులు నానాటికీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులపై లైంగిక వేధింపుల దృష్ట్యా ఆడపిల్లల తల్లిదండ్రులు తమ బిడ్డల భద్రతపై తల్లడిల్లుతున్నారన్నారు. పోక్సో కేసులపై నిర్దిష్ట సమీక్షలు, అధ్యయనాలు చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ నివేదికను తక్షణమే అందించి రాష్ట్రవ్యాప్తంగా నివారణ చర్యలు చేపట్టాలని అప్పారావు డిమాండ్ చేశారు.

19న విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని సబ్బవరం డి2 సెక్షన్ పరిధిలోని 33/11కెవి అంతకాపల్లి సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ వర్క్ కారణంగా ఈ నెల 19న శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నటుల ఎపిఇపిడిసిఎల్ కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులు అందుకు సహకరించాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ పరిధి గొల్లగుంట గ్రామంలో మొహర్రం (పీర్ల) పండుగను ముస్లిములు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లను గుర్తు చేసుకొంటూ.. పీర్లకొట్టం వద్ద ఏర్పాటు చేసిన అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ముస్లిములందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం పీర్లకు నైవేద్యం సమర్పించి, ఫాతియా ధువా పఠనంతో ముగించారు.



మొహర్రంలో పాల్గొన్న ముస్లిములు

రూ.10 లక్షలతో అన్న క్యాంటీన్ భవనానికి మరమ్మతులు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి బస్టాండ్ సమీపంలోని అన్నక్యాంటీన్ భవనానికి రూ.10 లక్షలతో మరమ్మతులు చేయడానికి బుధవారం పనులు ప్రారంభించారు. ఆగస్టు 15 నాటికి మరమ్మతులు పూర్తి చేసి ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నట్లు మున్సిపల్ అధికార్లు చెప్పారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.35 లక్షలతో నిర్మించిన అన్న క్యాంటిన్ భవనాన్ని వైసిపి ప్రభుత్వం 4, 5 వార్డు సచివాలయాలుగా ఉపయోగించుకున్న సంగతి పాఠకులకు తెలిసిందే. కాగా తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డతో మూతపడ్డ అన్నక్యాంటీన్‌లు తిరిగి ప్రారంభిస్తున్నారు. ఆగస్టు 15 నాటికి మరమ్మతులు పూర్తయిన భవనాల్లో అన్న క్యాంటీన్‌లు ప్రారంభమౌతాయని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. యలమంచిలి అన్న క్యాంటీన్ ప్రారంభానికి తగిన ఏర్పట్లలో కూటమి ప్రతినిధులు మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్నారు.



మరమ్మతులు చేస్తున్న అన్న క్యాంటీన్ భవనం ఇదే..

వికలాంగుల సంక్షేమ సంఘం సమావేశం



మాట్లాడుతున్న ప్రముఖ వైద్యులు నాగేంద్రబాబు

ప్రజాశక్తి- చోడవరం : మండల వికలాంగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం చోడవరంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు దుగ్గిరాల రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ వైద్యులు, లైన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ నాగేంద్రబాబు మాట్లాడుతూ సంఘం పారదర్శకతగా నడవాలని సూచించారు. అర్హులైన వికలాంగులందరికీ సర్టిఫికెట్స్ మంజూరు చేసి వారికి పింఛన్ అందేలా చూడాలన్నారు. సంఘం నాయకులు పిఎన్‌టి పట్నాయక్, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రాంబాబు, లయన్స్ సర్వీస్ ప్రెసిడెంట్ ముక్కా రమేష్, ఆర్స్ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. అనంతరం మండల నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా దుగ్గిరాల రవి కుమార్, అధ్యక్షులుగా శరగడం భూషణం, ఉపాధ్యక్షులుగా సాలాపు కుమారి, కార్యదర్శిగా పోలేపల్లి అజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీ సింగంపల్లి అనంత, కోశాధికారిగా గొల్లమాల మంగ, మరికొంతమంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

విత్తన యంత్ర పరికరంతో లాభసాటి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

విత్తన గొర్రె యంత్రపరికారంతో వరి రైతులకు లాభసాటిగా ఉంటుందని బిసిటి కృషి విజ్ఞాన కేంద్ర వ్యవసాయ యాంత్రీకరణ శాస్త్రవేత్త ఎంపి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో రైతు కర్రి నాగేశ్వరరావు భూమి 5 ఎకరాల విస్తీర్ణంలో విత్తన గొర్రె పరికరంతో వరి ఎదనాట్లు కార్యక్రమం బుధవారం చేపట్టారు. దీనిని పరిశీలించిన శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ విత్తన గొర్రె యంత్ర పరికరంతో వరి ఎద నాటు విధానం వలన ఎకరాకి రూ.7000 మిగులుతుందని చెప్పారు. ట్రాక్టర్ సహాయంతో విత్తన గొర్రె పరికరంతో విత్తనం వేసే విధానాన్ని ఆయన రైతులకు వివరించారు. ఈ విధానం పొడి దుక్కులో నేరుగా వరి విత్తనం ఎద పద్ధతిలో ఉంటుందన్నారు. దుక్కు దున్నడం, దమ్ము చేయడం, వరి నారు మడి తయారు చేయడం, కూలీలతో నాట్లు వేయించడం తదితర పనులు చేయనవసరం లేదని పేర్కొన్నారు. అయితే ఈ పద్ధతిలో ప్రధాన సమస్యగా కలుపు అని, విత్తనం వేసిన రెండు రోజుల లోపే కలుపు మందులు తప్పనిసరిగా పిసికారి చేయాలని సూచించారు. కలుపు నివారణ సమస్యకు ఒక ఎకరాకు ఒక లీటరు పెండిమిథాలిన్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పొలం అంతా పిచికారీ చేయాలన్నారు. ఆ సమయంలో నేలపై తడి తప్పనిసరిగా ఉండాలన్నారు.

వైసిపి కార్యకర్తలు చురుగ్గా ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ సూచించారు. స్థానిక రింగ్ రోడ్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నూతన ఇసుక విధానం ఏ విధంగా అమలు చేస్తుంది, ప్రభుత్వ వైఫల్యాల పట్ల గమనించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డేడ శివ, బొండా శంకర్రావు, కేయం నాయుడు, నడిశెట్టి మధు, గైపూరి రాజు, కలగా గున్నయ్య నాయుడు పాల్గొన్నారు.

నానిబాబుకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని రామన్నపాలెం గ్రామంలో ధర్మిరెడ్డి నానిబాబు చిత్రపటానికి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ బుధవారం నివాళులర్పించారు. రామన్నపాలెం గ్రామ సర్పంచ్ ధర్మిరెడ్డి నాయుడుబాబు తండ్రి నానిబాబు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఎమ్మెల్యే పాల్గొని నానిబాబు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు జె.నర్సింగరావు, ద్వారపురెడ్డి బాబ్జి, సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, సర్వేయర్ సత్తిబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.



నానిబాబుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

కొండెంపూడిలో ప్రభుత్వ భూమి స్వాధీనం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట
మండలంలోని కొండెంపూడి రెవెన్యూ సర్వే నెంబర్ 5లో ఉన్న 5ఎకరాల ప్రభుత్వ భూమిని బుధవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత భూమిలో స్థానిక విఆర్‌ఓ సత్యనారాయణమూర్తి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. 1993వ సంవత్సరంలో కడియాల రామారావు, కడియాల సాంబశివరావులకు ప్రభుత్వం డి-పట్టాలు ఇచ్చింది. కొంతకాలం వారు ఆ భూమిని సాగు చేసిన తర్వాత అయ్యరకలపాలెంకి చెందిన లంకా ప్రసాద్, లంకా సత్యనారాయణ, పినపాత్రుని వెంకట రమణ, నందమూరి నూకరాజు, సోమిరెడ్డి రాము, గొల్లవిల్లి ఈశ్వరరావు తదితరులకు లీజుకు ఇచ్చారు.
ఇది ఇలా ఉండగా, 2014-19 మధ్య మండలంలోని కొండెంపూడిలో ఏర్పాటు చేసిన కృషి విజ్ఞాన కేంద్రానికి గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన సుమారు 50 ఎకరాలు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. భూములు కోల్పోయిన రైతులు కొంతమంది గ్రామస్తులు ఈ భూమిని తమకు కేటాయించాలని కొంతకాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఏ.సత్యనారాయణ, దొండా శ్రీను, ఆధ్వర్యంలో భూములు కోల్పోయిన రైతులు బుధవారం పొలంలోకి వెళ్లి ట్రాక్టర్‌తో దుక్కి దున్నేశారు. కొంత పంట నష్టం వాటిల్లింది. ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్ఐ డి ఈశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లి ఇరు వర్గాలను శాంతింపజేసి, రెవెన్యూ సిబ్బందికి బందోబస్తు కల్పించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.


స్వాధీనం చేసుకున్న భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు


శుభాకాంక్షలు తెలుపుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

మంత్రిని కలిసిన వ్యవసాయాధికారుల సంఘం నేతలు

ప్రజాశక్తి-సబ్బవరం : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడును ఏపి వ్యవసాయ శాఖ అధికారుల సంఘం అనకాపల్లి జిల్లా యూనిట్ సభ్యులు శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయ అధికారుల పదోన్నతులపైనా, రైతులకు వ్యవసాయ పరికరాలు, టార్పాలిన్లు, స్ప్రేయర్లు తదితర వాటిపై మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, దానికి మంత్రి సానుకూలంగా స్పందించారు. అన్నదాతలకు వ్యవసాయ అధికారులు అండగా ఉండాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి విజయ ప్రసాద్, టి.శ్రీదేవి, జిల్లా శాఖ జాయింట్ సెక్రెటరీ కె.ఉమా ప్రసాద్, ట్రెజరర్ పి.విజేత తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆలయాల్లో ఎమ్మెల్యే గంటా పూజలు

ప్రజాశక్తి-కశింకోట : తొలి ఏకాదశిని పురస్కరించుకొని భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు బుధవారం కశింకోటలో ఉన్న పురాతన వేణుగోపాలస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేణుగోపాలస్వామి గుడిలో వేద పండితులు రాపేటి రామాచార్యులు, రాపేటి మారుతి పంతులు సాలువతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, డిసిసిబి మాజీ డైరెక్టర్ సిద్దిరెడ్డి శ్రీను, మాజీ ఎంపిపీలు పెంటకోట రాము, వేగి గోపికృష్ణ నాయకులు గల్లా కొండలరావు, కలగా సోమేశ్వరరావు, కాండ్రేగుల సతీష్, తాకాసి కృష్ణ, జైగ్రిపోతుల నూకునాయుడు, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, బాబర్, బుదిరెడ్డి గంగయ్య, సిదిరెడ్డి శ్రీను, తిర్రి చిరంజీవి పాల్గొన్నారు.

పాల సొసైటీ అధ్యక్షునిగా బొడ్డు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని రామయోగి అగ్రహారం పాల ఉత్పత్తిదారుల సొసైటీ అధ్యక్షునిగా బొడ్డు ముత్యాలనాయుడు బుధవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మండ శ్రీనివాసరావు, బోని సత్యనారాయణమూర్తి, యడ్ల పోతి బాబు, యడ్ల ముత్యాల నాయుడు, లెక్కల దేముడు, రెడ్డి రాము నాయుడు, యాల్ల రమణ, గుంపాన దేవుడమ్మ, యడ్ల అప్పారావు, సొసైటీ వేతన కార్యదర్శి నాగిరెడ్డి సత్యనారాయణ అభినందనలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షులు బొడ్డు ముత్యాల నాయుడు ఏర్పాటు చేసిన జ్ఞాపిక బహుమతులను డీసీసీబీ మాజీ డైరెక్టర్, ఎంపిటిసి యడ్ల రేవతి పైడిమ నాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు యడ్ల అప్పారావు, బాలిబోయిన దేముడుబాబు, బోని అప్పలనాయుడు, బోని శ్రీను, గుంపాన దేవుడు, యడ్ల ముత్యాల నాయుడు, పాల్గొన్నారు.


పాల క్యాన్లు అందిస్తున్న సంఘం అధ్యక్షులు

ఘనంగా జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర

ప్రజాశక్తి -మునగపాక : స్థానిక ఇంద్రజుమ్మ దేవాలయం నుండి భక్తుల గంటా నినాదాలతో జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర బుధవారం ఘనంగా జరిగింది. పది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజల అనంతరం తిరిగి జగన్నాథుని యధా స్థితిలో ఉండే ఆలయానికి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తరలించారు. గ్రామంలోని వీధుల గుండా జగన్నాధుని రథయాత్ర ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా జగన్నాధుని నవరాత్రి మహోత్సవాలు

అనకాపల్లి : డైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో హరేకృష్ణ సత్సంగ ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ మందిరంలో నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఏకాదశి పర్వదినాన తిరుగు రథయాత్ర పట్నంలోని పలు ప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని శ్రీమాన్ దుర్లభ కృష్ణ ప్రేమదాస్ తెలిపారు.

ఎఎంఎఎల్ కాలేజీలో సోలార్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నాలుగు కిలోవాట్ల సామర్థ్యంతో 3.5 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను బుధవారం ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకులు, కళాశాల పూర్వ విద్యార్థి కర్రి అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత ఎఎంఎఎల్ కళాశాలకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, సభ్యులు వాసిరెడ్డి బాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, పర్యవేక్షకులు పి.అనురాధ, వ్యాపారవేత్త పెంటకోట సూరిబాబు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు, కేవీస్ సత్యనారాయణ, కొణతాల రాజేంద్రప్రసాద్, ఎస్వీ నరసింహం, ఎస్.జగ్గారావు, బాబూజీ, ఏవీఎస్ ప్రసాద్, మళ్ల కోటేశ్వరరావు, ఎస్ కృష్ణబాబు, సిహెచ్ ధనంజయ, ఫిజిక్స్ హెడ్ నిరంజన్ కుమార్, కెఎఎస్ నాయుడు పాల్గొన్నారు.

జగన్నాథ స్వామి ఆలయానికి రూ.13 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం అగ్గిమర్రిచెట్టు వద్ద ఉన్న జగన్నాథ్ స్వామివారి రథయాత్ర మహోత్సవాలు పూర్తి అయిన సందర్భంగా బుధవారం ఆలయ మండపంలో భక్తులు నగదును హుండీ లెక్కించారు. భక్తులు హుండీ ద్వారా, దర్శనం టికెట్లు ద్వారా పది రోజులకు రూ.13,01,385 ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఆలయ ఉత్సవ్ కమిటీ ఛైర్మన్ దాడి బుజ్జి, ఆలయం ఈవో రాజా సులోచన, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ, డైరెక్టర్లు. బొండా రమేష్, అనకాపల్లి మోహన్‌రావు, బోడ్డేడ వెంకట చలపతిరావు, కాండ్రేగుల వెంకట వీర అప్పారావు, బుగత కోటేశ్వరరావు, యల్లమల్లి ధనలక్ష్మి, బుద్ద లక్ష్మీ అప్పారావు, శరగడం కృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అప్పారావు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనంతగిరి పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ అనారోగ్యంతో ఈ నెల 7న మృతి చెందిన స్థానిక ఎఎంఎఎల్ కాలేజీ జంక్షన్, సాయినగర్‌కు చెందిన నక్క అప్పారావు కుటుంబానికి శక్తి పోలీస్ వెల్ఫేర్ సభ్యులు బుధవారం లక్ష రూపాయల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 1990 పోలీస్ ట్రైనింగ్ బ్యాచ్కు చెందిన అప్పారావు కుటుంబానికి అన్ని వేళల అండదండలుగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ 1990 ప్రెసిడెంట్ టి.అనిల్, సుబ్బరాజు, ముబారక్, బోని శ్రీనివాసరావు, ఆనంద్, రామారావు, నరసింగరావు, కోటేశ్వరరావు, గంగాధర్, వెంకట్రావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లాను కలిసిన సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి : గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలిపారు. అనకాపల్లి నూకాంబికా అమ్మవారి చిత్రపటం అందజేశారు. త్వరలో ఉత్తరాంధ్ర నూకాంబిక అమ్మవారి దర్శనానికి రావాలని ఆహ్వానించగా అందుకు శ్రీనివాసరావు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆడారి వెంకట్రావు, డివి సత్యారావు పాల్గొన్నారు.

నేడు ఆరు గ్రామాల్లో అమ్మవార్ల పండగలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఆరు గ్రామాలలో గురువారం గ్రామదేవతల పండుగలు నిర్వహిస్తున్నారు. వడ్డాది, మంగళాపురం, కొండెంపూడి గ్రామాల్లో మరిడిమాంబ అమ్మవారికి, నీలకంఠాపురం, ఎం భూపతి పాలెం, పోలేపల్లి గ్రామాల్లో భూలోక తల్లికి పండుగలు నిర్వహిస్తున్నారు. పండుగలు సందర్భంగా ఆయా గ్రామాల్లో ఘటాలు ఊరేగింపు, నేలవేషాలు, బాణాసంచా కాల్చివేత, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ఆలయాలు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

21న గురు పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం, విజయరామరాజుపేట షిరిడి సాయిబాబా ఆలయం వద్ద ఈ నెల 21న ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు జరగనున్నాయి. ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తారు. భక్తులకు పులిహోరా ప్రసాదం, రవ్వసూక ప్రసాదం అందజేస్తారు. సాయంత్రం 4 నుండి కోలాటం, టీన్మార్, భారీ బాణాసంచాతో స్వామిని పురవీధుల్లో పల్లకిలో ఊరేగిస్తారు.

వైసిపి భూఆక్రమాలపై చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : వైసిపి ప్రభుత్వ పాలనలో భారీ భూదోపిడీ జరిగిందని ఎమ్మెల్యే పి.గణబాబు ఆరోపించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.ఒక లక్ష 90వేలు కోట్లు భూ ఆక్రమాలు గత వైసిపి పాలనలో జరిగాయన్నారు. భూ దోపిడీలు, అక్రమాల పై కూటమి ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసిందన్నారు. విశాఖలో కూడా భారీ భూదోపిడీకిజరిగిందని, రుషికొండలో రూ.500 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి జగన్ రెడ్డి ప్యాలస్ నిర్మించారన్నారు. వీటన్నింటిపైనా కూటమి ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

జనసేన సభ్యత్వంతో ప్రమాద బీమా

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రతి ఒక్కరూ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కలిగినట్లయితే రూ. ఐదు లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని ఆనందపురం మండల పార్టీ అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు అన్నారు. బుధవారం సాయంత్రం ఆనందపురం కూడలిలో జనసేన పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జనసేన క్రియాసభ్యత్వం పొందిన వ్యక్తులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.ఐదు లక్షల బీమావారి కుటుంబానికి వర్తిస్తుందన్నారు. 2024సంవత్సరానికి క్రియాశీల సభ్యత్వ నమోదు ఈ నెల 18 నుండి 28 వరకు జరుగుతుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా జనరల్ సెక్రెటరీ మజ్జి శ్రీను, మండల పార్టీ జనరల్ సెక్రెటరీ కోరుకొండ మూర్తి, ఆనందపురం మండల ఉపాధ్యక్షులు గొలగాని బాలు, తాటివాడి శివకృష్ణ, గోవింద తెడ్లావు నర్సింగ్ పాల్గొన్నారు

సెప్టెంబర్‌లో టైప్ రైటింగ్ పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : ఏపి సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 35 టైప్ రైటింగ్ పరీక్షా కేంద్రాల్లో ఈ ఏడాది సెప్టెంబర్ 28,29 తేదీల్లో ఇంగ్లీష్, తెలుగు భాషల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్లు, హిందీలో లోయర్, హయ్యర్ గ్రేడ్లు, ఇంగ్లీష్ జూనియర్ గ్రేడ్‌లలో టైప్ రైటింగ్ పరీక్షలు జరుగుతాయని చిట్టివలస, లక్ష్మీ టైప్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్, జిల్లా టైప్ రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ అసోసియేషన్ సభ్యులు బల్లా వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే నెల 21,22 తేదీల్లో షార్ట్ హ్యాండ్ పరీక్షలు రాష్ట్రంలోని 6 కేంద్రాల్లో జరుగుతాయని తెలిపారు సంబంధిత పరీక్షలకు సుమారు 70 రోజులు సమయం ఉన్నందున దగ్గర్లో వున్న గుర్తింపు పొందిన టైప్ ఇనిస్టిట్యూట్‌ను సంప్రదించి సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు

ఎత్తిపోతల పథకం నిర్మాణంపై ఎమ్మెల్యే దృష్టి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం లింగ భూపాలపురం అగ్రహారంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని పూర్తి చేయడంపై ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు దృష్టి సారించారు. ఈ మేరకు బుధవారం ప్రాజెక్టుకు సంబంధించి డిఈ ఎం.కామరాజు, ఎఈ అనుదీప్‌తో సమావేశమై ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయడంపై చర్చించారు. పైప్‌లైన్ రూట్ మ్యాప్ డిజైన్ మార్పు రివైజ్ ఎస్టిమేట్లు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. రివైజ్ ఎస్టిమేట్లకు అనుమతులు తీసుకొచ్చి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమరాన దాసు, దొండా శీను, తమరాన నాయుడు, తమరాన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు సాగుపై రైతుల ఆసక్తి

-తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం- సరుగుడు కర్రలకు పెరుగుతున్న డిమాండ్



ప్రజాశక్తి గొలుగొండ: వేలాది రూపాయలు పెట్టుబడిపెట్టి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడం, సాగునీటి వనరుల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేయడంతో మండలంలో పలు గ్రామాల రైతులు వ్యవసాయ పంటల సాగుకు స్వస్తి చెప్పి సరుగుడు తోటలు సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. వర్షాలు పెద్దగా కురవక పోయినా, తక్కువ పెట్టుబడి, కొద్దిపాటి శ్రమతో మొక్కలు నాటిన నాలుగైదేళ్లలో పంట చేతికొస్తుండటంతో మెట్ట ప్రాంతాల్లోని రైతులు సరుగుడు సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

ఒకప్పుడు వర్షాధారంగా, నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సరుగుడు సాగు చేసేవారు. రిజర్వాయర్లు, చెరువులు, గ్రోయిన్లు, ఆనకట్టల ఆధారంగా నీటి సదుపాయం వున్న భూముల్లో వరి, చెరకు పండించేవారు. కానీ ఈ రెండు పంటల సాగు ఖర్చులు విపరీతంగా పెరిగి పోతుండటం, అంతే నిష్పత్తిలో ధాన్యం, చెరకుకు గిట్టుబాటు ధరలు లభించక పోవడంతో పలు మండలాల్లో రైతులు వరి, చెరకు పంటల సాగుకు స్వస్తి పలుకుతున్నారు. దీనికితోడు జిల్లాలో మూడు సహకార చక్కెర ఫ్యాక్టరీలను ప్రభుత్వం మూసేయించడం, ఉన్న ఒక్కగానొక్క గోవాడ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు డబ్బులు చెల్లింపుల్లో తీవ్రజాప్యం చేస్తుండటంతో చెరకు సాగు గణనీయంగా తగ్గింది. ప్రత్యామ్నాయంగా రైతులు సరుగుడు సాగును ఎంచుకున్నారు.

గొలుగొండ మండలంలో దాదాపు అన్ని పంచాయతీల్లో సరుగుడు సాగు చేపట్టారు. మొక్కలు నాటిన నాలుగైదేళ్లకు చెట్లు కోతకు వస్తాయి. ఎకరాకు గతంలో 40-50 టన్నుల దిగుబడి వచ్చేది. కొంతకాలం నుంచి టిష్యూ కల్చర్/ క్లోనింగ్ నారు అందుబాటులోకి రావడంతో ఎకరాకు 80-100 టన్నుల వరకు దిగుబడి వస్తుందని, రైతులు చెబుతున్నారు. ఆరు నెలల క్రితం వరకు సరుగుడు బాదులు టన్ను రూ.4,800లు, ముక్కలు రూ.2,850లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. తరువాత నుంచి క్రమేపీ ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం సరుగుడు బాదులు టన్ను రూ.8,000, ముక్కలు రూ.4,800కి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం కొనుగోలు ధరలు పెరగడంతో గత ఏడాది వరకు మండలంలో సుమారు 750 ఎకరాల్లో సరుగుడు సాగు చేయగా ప్రస్తుతం ఎక్కువ శాతం రైతులందరూ సరుగుడు సాగుపై ఆసక్తి కనబరుస్తూ సుమారు 1500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సరుగుడు రాబడి పెరగడంతో ఈ ఏడాది సరుగుడు సాగు గణనీయంగా పెరిగింది. అచ్యుతాపురంలోని ఎస్‌ఈజడ్లో ఏర్పాటు చేసిన ఒక ప్లైవుడ్ తయారీ ఫ్యాక్టరీకి రోజూ వెయ్యి టన్నుల వరకు సరుగుడు లేదా సుబాబుల్ అవసరం. దీంతో సరుగుడుకు డిమాండ్ ఏర్పడి ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

ప్రజాశక్తి -కొత్తకోట: ప్రకృతి వ్యవసాయం చేయడంతో ఖర్చు తగ్గి అధిక ఆదాయం, దిగుబడి సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నా, రాంగోవింద్, వర్మ తెలిపారు. రోలుగుంట, రావికమతం, గొలుగొండ, మాకవరపాలెం, కోటవురట్ల మండలాల్లో పని చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి బుధవారం దొండపూడి ఆర్‌బికె కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులకు ముందుగానే బీజా, ద్రవ జీవామృతం తయారీ పైన అవగాహన కల్పించారు. రైతులతో తయారీ చేయించారు.రైతులు రసాయనిక ఎరువులు వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం పై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు నాగేశ్వరరావు, కవిత, మోదినాయుడు, రామకృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.



పనులు చేయిస్తున్న నాయకులు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి-నాతవరం: మండలంలోని ఎంబి పట్నం పంచాయతీలో పారిశుద్ధ్య పనులను పంచాయతీ కార్యదర్శి చినబాబు, టిడిపి నాయకులు పల్లి బాపన్నాయుడు, సర్పంచిలు చేయించారు. వర్షాలకు కాలువల్లో నీరు నిల్వ ఉండి సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కాలువల్లో పేరుకు పోయిన పూడికను తీస్తున్నామన్నారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు. నీటి నిల్వ ఉంచిన ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ చల్లారు. తాగునీటి ట్యాంకర్ శుభ్రపరిచి నీటిని క్లోరినేషన్ చేశామని చెప్పారు.



కుళాయి పనులు చేస్తున్న నాయకులు

ఇంటింటికి కుళాయి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయితీ ఏఎల్.పురం గ్రామంలో మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ చొరవతో ఇంటింటికి కుళాయి పనులు ప్రారంభమయ్యాయి. వీధులలో మంచినీటి కుళాయిలు లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని పలుమార్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో వేణుగోపాల్ మాట్లాడారు. కుళాయిలు లేని వీధులను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను కోరారు. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బుధవారం గ్రామంలో కుళాయి పనులు ప్రారంభించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదన్నారు.

ఉపమాకకు పోటెత్తిన భక్తులు



ఉపమాకలో బారులు తీరిన భక్తులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా ఉత్తర వాహిని నది తీరంలో సత్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పెరవెల్లి రామం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో భక్తులు పోటెత్తారు. బుధవారం తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కొండపైన, దిగువున ఉపాలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్, ఆచార్యులు, కృష్ణమా చార్యులు, శేషాచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు బారులు తీరారు. సాయంత్రం శ్రీనివాస భజన సమాజం బృందం సభ్యుల ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించారు.

'ఉత్తరాంధ్రలో వలస నేతలు లేకుండా చేద్దాం'

ప్రజాశక్తి- సీతమ్మధార: వలస నేతల కనుసన్నల్లోనే ఉత్తరాంధ్రలో రాజకీయాలు సాగుతున్నాయని, ఇక్కడ వలస నేతలు లేకుండా చేద్దామని బిఎస్‌పి రాష్ట్ర సమన్వయకర్త, మాజీ డిజిపి జె.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని పౌర గ్రంథాలయంలో బహుజన సమాజ్ పార్టీ ఉత్తరాంధ్ర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలలో ఉత్తరాంధ్రలో టిక్కెట్లను టిడిపి, వైసిపిలు వలస నేతలకే ఇచ్చారన్నారు. అనకాపల్లి ఎంపిగా సిఎం రమేష్ గెలివారన్నారు. అదే ఉత్తరాంధ్ర నుంచి ఎవరైనా నేత కడప వెళ్లి పోటీచేయగలరాయని ప్రశ్నించారు. గతంలోనూ పురందేశ్వరి, నేదురుమల్లి జనార్ధనరెడ్డి, సుబ్బిరామిరెడ్డి, వంటి వలస నేతలు విశాఖ ఎంపీలుగాగెలిచారని, గడచిన ఐదేళ్లలో విజయసాయిరెడ్డి, వైవి.సుబ్బారెడ్డి ఉత్తరాంధ్ర రాజకీయాల్లో చక్రం తిప్పారన్నారు. బొత్స, ధర్మాన వంటి నేతలు కుటుంబ ప్రయోజనాలకే పనిచేశారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరం కాదని ఉక్కు మంత్రి కుమారస్వామితో ప్రకటించడం కాదని, ప్రధాని మోడీ అనేలా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ చేయగలరాయని ప్రశ్నించారు. బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు బీ. పరంజ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలో బిసి గణన చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, ప్రకాశరావు, సత్యం, తిరుపతి రావు, బావయ్య, శివ ప్రసాద్, కృష్ణ, చిన్నా రావు, సుబ్రహ్మణ్యం, వేంకటేశ్వర రావు పాల్గొన్నారు.

ఎయు విసిగా దళితులకు ఛాన్సివ్వాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా దళితులకు అవకాశం ఇవ్వాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్), అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (ఎఎంఎస్) డిమాండ్ చేసింది. బుధవారం అంబేద్కర్ భవన్‌లో విలేకర్లుతో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి ప్రభాకర్ మాట్లాడుతూ ఎయు విసి రాజీనామాను గవర్నర్ ఆమోదించడాన్ని స్వాగతించారు. ఎయు ప్రతిష్టను గత విసి దిగజార్చి, పార్టీ కార్యాలయంగా మార్చేశారని ఆరోపించారు. రిటైరైన వారిని కీలక పదవుల్లో నియమించి, అర్హులైన వారిని ఉద్యోగాల నుంచి తొలగించి వేధింపులకు గురిచేశారన్నారు. పాతికేళ్లుగా ఒసి, బిసిలే ఎయు విసిలుగా వ్యవహరించారని, ఈ సారైనా నైపుణ్యత, ప్రతిభ ఉన్న దళిత ప్రొఫెసర్లు, మేధావులు ఎందరో ఎయులోనే ఉన్నారని, వారికి విసి లుగా అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎస్ .రాజు, కార్యదర్శి జి. రాంబాబు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కండక్టర్ చిట్టిబాబుపై చేయి చేసుకున్న వ్యక్తిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కండక్టర్ తెలిపిన వివరాల ప్రకారం నర్సీపట్నం నుండి తోటకూరపాలెం నడుపుతున్న బస్సు సర్వీసులో కండక్టర్ చిట్టిబాబు కొండల అగ్రహారం గ్రామానికి చెందిన సుర్ల వెంకటేష్‌ను టిక్కెట్టు తీసుకోమని అడిగారు. వెంకటేష్ దురుసుగా ప్రవర్తించి కొట్టాడని కండక్టర్ తెలిపారు. ఇదే రూట్లో తరచుగా దాడులు చేస్తున్నారని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డ్యూటీలో ఉన్న కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తి పై కేసు నమోదు చేయాలని ఆర్టీసీ సంఘం, విదసం నాయకులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును ఎస్సై ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు. డ్యూటీలో ఉన్న ఉద్యోగులపై దాడులు చేస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

21న గురుపూజ వేడుకలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగుంపేట గ్రామంలో షిర్డిసాయిబాబా ఆలయంలో ఈ నెల 21న షిర్డిసాయి బాబా గురుపూజ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు షిర్డిసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటలకు కాగడ హారతి, 7 గంటలకు పంచనాభిషేకం, పాలాభిషేకం, ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజాభిషేకములు, మధ్యాహ్నం 12 గంటలకు హారతి ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం అన్నసమారాధన జరగనుందని చెప్పారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని షిర్డిసాయి సేవ సమితి సభ్యులు కోరారు.

నేడు సత్తమ్మ తల్లి పండుగ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లులో సత్తమ్మ తల్లి పండుగను ఈనెల 18న గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసారు. ప్రతి ఏడాది తొలి ఏకాదశి పర్వతం మరుసటి రోజు సత్తమ్మ తల్లి పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇప్పటికే అమ్మవారి విగ్రహానికి, ఆలయానికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. విద్యుద్దీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా చింతలపాటి కుటుంబీకులు, ఆలయ నిర్వాహకులు నడింపల్లి సూర్యనారాయణ (రాజు బాబు) మాట్లాడుతూ, సత్తమ్మ తల్లి పండుగను గురువారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

ప్రయివేటు కళాశాలల యాజమాన్యం దౌర్జన్యంపై..

ఎస్‌ఎఫ్‌ఐ నేతల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు జీ.గీతాకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. మొహరం రోజున నర్సీపట్నంలో ప్రైవేటు కళాశాలలు తెరుచుకోవడంతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అక్కడకు వెళ్లారు. ప్రైవేట్ కళాశాలలు నచ్చినట్టుగా నడుపుకుంటున్నారని గీతాకృష్ణ విమర్శించారు. నర్సీపట్నం ఆదిత్య కళాశాల, శ్రీసాయి కళాశాలలకు వెళ్లి ప్రభుత్వ సెలవులు రోజు కళాశాల ఎందుకు పెట్టారని అడిగితే దురుసుగా సమాధానం ఇస్తూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను బయకు గెంటేశారన్నారు. శ్రీసాయి కళాశాల యాజమాన్యం దౌర్జన్యం చేయడంపై నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతం, ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ సభ్యులు జనార్దన్, రాయుడు, మను, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

కళాశాలపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

నర్సీపట్నం టౌన్:

నర్సీపట్నంలో శ్రీసాయి(ఎన్టీఆర్) కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, మొహరం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ నర్సీపట్నంలో శ్రీసాయి(ఎన్టీఆర్) కళాశాల, ఇతర ప్రైవేటు కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించారన్నారు. విద్యార్థుల అభ్యర్ధన మేరకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాయి కళాశాల యాజమాన్యాన్ని తరగతుల నిర్వహరణపై అడగ్గా కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది దౌర్జన్యంగా ఎస్‌ఎప్‌ఐ నాయకులు మెడ పట్టి నెట్టి దుర్భాషలాడి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నర్సీపట్నంలో ప్రైవేటు కళాశాలల పై ఉన్నత విద్యాశాఖ ఆదికారులు పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సంఘటన పై జిల్లా ఉన్నత విద్యాశాఖ ఆదికారులు, కలెక్టర్, బాలల హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని ఆయన వెల్లడించారు.


ఇదే పశువైద్యశాల

పరాయి పంచన పశు వైద్యశాల

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో తంగేడు గ్రామంలో పశువైద్యశాల లేక పోవడంతో విశాఖ పాల డైరీ పంచన పశు వైద్య సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తుంది. గతంలో తంగేడు గ్రామానికి సంబంధించి పశువైద్యశాల భవనం ఉండేది. అది శిథిలావస్థకు చేరుకోవడంతో దాదాపు 15 సంవత్సరాలుగా ఈ వైద్యశాల విశాఖ డైరీ పంచన నిర్వహిస్తున్నారు. గ్రామస్తులు, పశు వైద్య సిబ్బంది పలుమార్లు అధికారులకు విన్నవించినా భవన నిర్మాణం చేపట్టలేదు. దీంతో సిబ్బంది, రైతులు అవస్థలు పడుతున్నారు అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి పశువైద్యశాలకు శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


మొక్కను నాటుతున్న రేంజర్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-చీడికాడ: ప్రతి ఒక్కరూ అమ్మకు పేరుతో మొక్కను నాటండి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చోడవరం రేంజర్ బి.గౌరేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మండల కేంద్రం, అప్పలరాజు పురం బీసీ హాస్టల్, జి.కొత్తపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో చోడవరం అటవీ శాఖ అధికారి ఆదేశాల మేరకు ఎఫ్ఎస్ఓ రమణ ఆధ్వర్యాన బుధవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బిసి హాస్టల్ వార్డెన్ జే.నారాయణరావు, సోషల్ ఫారెస్ట్ సిబ్బంది బి.గౌరేష్, ఎఫ్ఎస్ఓ కురచా వెంకటరమణ, అర్జున, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బాలింతలకు బెడ్ షీట్లు ఇస్తున్న క్లబ్ ప్రతినిధులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన సేవలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక వాసవి పంచాయతన దేవాలయం వద్ద ప్రజల సౌకర్యార్థం రోటరీ జిల్లా నిధులు, క్లబ్ సభ్యుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ రొటీరియన్ ఎం.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఉన్న బాలింతలు అందరికీ సుమారు 100 బెడ్ షీట్లు, చిన్నారులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఫాస్టు ప్రెసిడెంట్ ఎం.మహేష్ కుమార్, సెక్రటరీ వై.శ్రీనివాసరావు, ట్రెజరర్, ప్రస్తుత ప్రెసిడెంట్ కొండల రాయుడు, సెక్రటరీ పెనుగొండ రమేష్, ట్రెజరర్ సుతాపల్లి శ్రావణ్ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్‌లు సుతాపల్లి శ్రీకాంత్, పచ్చిగోళ్ల నారాయణరావు, టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పూసర్ల సోమేశ్వరరావు, నగర ప్రముఖులు వెలగా నారాయణరావు, మామిడి రామకృష్ణ, ఇతర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

1 నుంచి ఫిలిం యాక్టింగ్ వర్క్ షాప్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సహకారంతో, వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ సారధ్యంలో ఆగస్టు 1 నుంచి 3 వరకు ఆసక్తి గల కళాకారులకు ఫిలిం యాక్టింగ్‌లో వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఎల్లాజీ తెలిపారు. బుధవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో పాటు ఇతర జిల్లాల్లో నటన నేర్చుకోవాలని ఆసక్తి కలిగిన కళాకారులకు ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. మూడు రోజులకు ప్రవేశ రుసుం రూ.500 నిర్ణయించినట్లు తెలిపారు.

వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ అష్రఫ్ మాట్లాడుతూ, నగరంలో నటించాలనే కుతూహలంతో ఉన్న వారికి నటనపై సరైన అనగాహన లేక సతమతమవుతున్నారని, అలాంటివారు ఈ వర్క్ షాప్‌లో పాల్గొంటే నటనపై ఉన్న ప్రాథమిక అంశాలపై నిపుణులైన ఎఫ్ఎం బాబాయ్, గద్దె వరప్రసాద్ తదితరులతో తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణకు వచ్చే కళాకారులందరూ 8919347875, 8885351807 9642707036 ఫోన్ నెంబర్‌లో వివరాలు తెలిపి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగ సాయి నాటక సంస్థ వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి, గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వై.అప్పారావు, సహాయ కార్యదర్శి ఉమామహేష్, గణేష్ పాల్గొన్నారు.


దీక్షలో కూర్చున్న సిఐటియు సీనియర్ నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ పేరు చెప్పి ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులు, ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకోవాలని, ఆ మేరకు ప్రధాని మోడీతో ప్రకటన చేయించాలని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1208వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోకపోతే ఎన్నికల్లో నెగ్గిన వారిని ప్రజలు క్షమించరన్నారు. ఈ దీక్షల్లో సంజయ్, ప్రకాష్, ఎర్రబాబు, గురువులు, ఎయు మాజీ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ అక్రమ కేసులు రద్దు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎపిజిఈఎ) నూతన రాష్ట్ర అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న కెఆర్.సూర్యనారాయణపై గత వైసిపి ప్రభుత్వ హయాంలో పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయాలని ఆ సంఘ నగర అధ్యక్షుడు డి.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నగర నూతన యూనిట్ సభ్యులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర, జిల్లా సంఘం ఆదేశాలు ప్రకారమే పని చేస్తామన్నారు. ఎఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి రమణ మాట్లాడుతూ తమ సంఘం ప్రభుత్వాలకు భజన కాదని బాధ్యతతో పని చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం తమకు తెలియకుండా జిపిఎఫ్ సొమ్ము ఇతర అవసరాలకు వాడుకుందన్నారు. డిఎ, టిఎ బకాయిలు చెల్లించలేదన్నారు. ఈ డిమాండ్ల సాధనకు గవర్నర్‌ను కలిశారన్న కారణంగా రాష్ట్ర అధ్యక్షుడు సూర్య నారాయణ మీద తప్పుడు కేసులు పెట్టారని గుర్తు చేశారు.



మాట్లాడుతున్న ఎపిజిఈఎ యూనిట్ సభ్యులు

దీనికి కారణమైన సజ్జల రామకృష్ణారెడ్డిపైనా, మాజీ సిఎస్ జవహర్‌రెడ్డిపై జ్యుడీషియల్ ప్రివ్యూ కమిషన్ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా డివిజన్ అధ్యక్షుడు రమణ, ఉపాధ్యక్షురాలు సుచరిత, అనకాపల్లి అధ్యక్షుడు బాబూరావు, విశాఖ నగర కార్యదర్శి డివిఎస్ఎన్.రాజు, కోశాధికారి డి.హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్ నిర్వీర్యంతో మహిళలపై పెరిగిన దాడులు



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కూటమి ప్రభుత్వం దిశ యాప్, దిశ చట్టాన్ని నిర్వీర్యం చేయటంతోనే రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగాయని వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. బుధవారం సాయంత్రం సిరిపురంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దారుణంగా క్షీణించిందని, ఆడపిల్లలు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత, ఈ 40 రోజుల్లో రోజూ మూడు హత్యలు, ఆరు రేప్‌లు అన్నట్లుగా పరిస్థితి మారిందని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించడం లేదన్నారు. దాడులు, దౌర్జన్యాలు జరిగితే అక్కడ బాధితులపైనే కేసులు పెట్టడం, ఎక్కడికక్కడ వైసిపిని లేకుండా చేయాలన్న కుట్ర దిశలో దాడులు, ఆస్తుల విధ్వంసం, ప్రాణాలు సైతం తీసే పరిస్థితి నెలకొందని ఆరోపించారు.